క్లుప్తంగా

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందనలు



గుంటూరు ఎడ్యుకేషన్: తమ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సత్తా చాటారని మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మాజేటి వెంకట రామ కోటి ముత్యాలు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్ని అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవ పెద్ది విజయలక్ష్మి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ విద్యార్థి షేక్ సల్మాన్ 90 శాతం మార్కులతో ఎంపీసీ గ్రూపులో మొదటి స్థానం, ఎంఈసీలో బి.గోవిందా సాయి కామర్స్‌లో 99 శాతం మార్కులు సాధించారన్నారు. సీఈసీలో లూక్ ఒబెర్సన్ 95శాతం మార్కులు కామర్స్‌లో సాధించాడని చెప్పారు. పి.అభిలాష్ , ఏ.నిరంజన్‌రెడ్డి మెరుగైన 70 శాతం మార్కులతో పాటు తెలుగు సబ్జెక్టులో ముగ్గురు విద్యార్థులు 99, 98, 97 మార్కులు సాధించి కళాశాల గౌరవ ప్రతిష్ఠలు ఇనుమడింప చేశారని ఆయన వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లిటిల్ స్టెప్స్ ప్రీస్కూలుకు అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: నవభారత్‌నగర్ రెండో లైనులోని లిటిల్ స్టెప్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ దేశంలోని టాప్–100 ప్రీ స్కూళ్లలో ఒకటిగా నిలిచినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ షేక్ షాజహాన్ తెలిపారు. చెన్నైలో గురువారం ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ అండ్ లెర్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎర్లీ ఇయర్స్ ఎడ్యుకేటర్స్ సమ్మిట్‌లో భాగంగా ఆయన తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తమిజాక్షి తంగపండియన్, సినీ నటి జానకి సబేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. భారతదేశం నలుమూలల నుంచి అవార్డుకు ఎంపికైన పాఠశాలల యాజమాన్యాలతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అవార్డు అందుకున్నట్లు వివరించారు. విద్యలో నాణ్యత, పర్యావరణ పరిరక్షణ, నిబద్ధతతో తల్లిదండ్రుల నమ్మకాన్ని పెంపొందించుకుంటున్నామని తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి




పాత గుంటూరు: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ నిర్మాత సి.అశ్వనీదత్‌ను టీడీపీ సీనియర్ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, తెనాలి శ్రావణ్‌కుమార్, నసీర్ అహ్మద్, డేగల ప్రభాకరరావు, కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు డ్రా

గుంటూరు ఈస్ట్: ఏటీఎం సెంటర్‌లో కార్డు మార్చి వేసి మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 3వ లైనుకు చెందిన టి.వీరాస్వామి ఈనెల 24న నగరంపాలెం ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అనారోగ్యంతో డబ్బులు డ్రా చేయలేక అక్కడ ఉన్న వ్యక్తి సహాయం కోరారు. ఆ వ్యక్తి ఏటీఎం కార్డు పెట్టి పనిచేయడం లేదని చెప్పి మార్చి ఇంకొకటి ఇచ్చాడు. అనంతరం కొంతసేపటికి వీరాస్వామి అకౌంట్‌లో నుంచి రూ. 35వేలు విత్‌డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. తాను మోసపోయినట్లు గుర్తించి వీరాస్వామి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వెంగళరావునగర్ చెందిన గుండెలగుంట చెంచయ్య ఈనెల 25న డ్యూటీకి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. భార్య జి.రమణ చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రక్తహీనతతో ప్రాణాపాయం

- పిల్లలు, యువత, విద్యార్థులు, గర్భిణుల్లో అధికం
- విద్యార్థులకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు
- మందులు, ఆహారంతో నివారణ

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలితో విద్యార్థులు, యువత రక్తహీనత బారిన పడుతున్నారు. సకాలంలో గుర్తించి వైద్యం చేయించని పక్షంలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. రక్తహీనత సమస్య పురుషుల్లో కంటే స్త్రీలల్లో ఎక్కువగా ఉంటుంది. గర్భిణుల్లో మరీ ఎక్కువగా ఉంటుంది. నివారించని పక్షంలో కాన్పు సమయాల్లో మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఎనీమియా ముక్తభారత్‌లో భాగంగా ప్రభుత్వం కౌమార దశలోని బాలికలు, కళాశాల యువత, గర్భిణులకు ముందస్తుగా నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు సైతం అందిస్తోంది. రక్తహీనత నివారించదగినదే. కొద్దిపాటి అవగాహనతో జాగ్రత్తలు తీసుకుంటే దరిచేరదు. జాగ్రత్తలపై 'సాక్షి ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

లక్షణాలు

నీరసం, ఆకలి మందగించటం, ఆయాసం, పని మీద శ్రద్ధ లేకపోవడం, కాళ్లు చేతులు నొప్పులు, కొద్దిసేపు పనిచేసినా అలసిపోవడం, శరీరం పాలిపోయినట్లు ఉండటం, ఛాతీనొప్పి, గుండెదడ, కళ్లు తిరగడం, ఉన్నట్లుండి బైర్లు కమ్మడం, కింద పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తహీనత ఎక్కువగా ఉంటే పాదాలు, కాళ్లు, ముఖం వాయడం, నీరు చేరడం, భుజాల దగ్గర, నడుం, కీళ్లలో నొప్పులు, గోళ్లు, పెదాలు పాలిపోవడం, గోళ్ల మధ్యలో చెంచాలాగా గుంటలు పడటం, నున్నగా మెరిసే నాలుక, పాలిపోయిన చిగుళ్లు, కంటి కింద రెప్ప లోపల భాగం తెల్లగా ఉండటం , నాడి ఎక్కువగా కొట్టుకోవడం తదితర లక్షణాలు ఉంటాయి.

జిల్లాలో బాధితుల వివరాలు

జిల్లాలో రక్తహీనత సమస్య నివారించేందుకు ముందస్తుగా పాఠశాలల్లో బాలికలకు, కళాశాలలో యువతులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో 38,329 మంది విద్యార్థినులు ఉండగా, గత ఏడాది 38,052 మందికి అంటే 99 శాతం స్క్రీనింగ్ పూర్తి చేశారు. వీరిలో 88 మందికి తీవ్రం, 11,716 మందికి మైల్డ్‌గా, 16,015 మందికి మోడరేట్ రక్తహీనత ఉన్నట్లు గుర్తించి మాత్రలు, సిరప్ బాటిళ్లను ఉచితంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అందించారు. పదేళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు వారిలో బాలికల్లో స్కూల్ హెల్త్ ఎనీమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు గర్భిణుల్లో సైతం ప్రతినెలా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్నవారికి మందులతో పాటు పౌష్టికాహారం కూడా ఐసీడీఎస్, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా అందిస్తున్నారు.

రక్తహీనత నివారణ చర్యలు

గర్భం వచ్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రతిరోజూ ఒక ఫోలిక్ యాసిడ్ మాత్ర మింగాలి. సీ విటమిన్ లభించే దానిమ్మ, ద్రాక్ష, బత్తాయి, చీని, నిమ్మ, నారింజ, కమలాలు, రేగు, ఉసిరి తినాలి. ప్రతి మనిషికీ రోజుకు కనీసం 30 మిల్లీ గ్రాముల ఇనుప ఖనిజం అవసరం. విటమిన్ బీ1, విటమిన్ బీ2, ఫోలిక్ యాసిడ్, విటమిన్ సీ అన్నీ కలసి ఇనుప ఖనిజం శరీరానికి తగినంతగా అందించేందుకు తోడ్పడతాయి. రక్తం పుష్కలంగా తయారవ్వటానికి తాజా పండ్లు, ఆకుకూరలు, గోంగూర, పాలకూర, బచ్చలికూర, తోటకూర, చిక్కుళ్ళు, బఠానీలు, సజ్జలు, రాగులు, లివర్, గ్రుడ్లు, చేపలు, పప్పులు, బెల్లం ఎక్కువగా తీసుకోవాలి.

రక్తహీనత అంటే ?

రక్తానికి హిమోగ్లోబిన్ అనే పదార్థంతో ఎర్రని రంగు వస్తుంది. ఇది ఇనుముకు సంబంధించినది. శరీరంలో రక్తం ఉండాల్సిన పరిమాణంలో లేకపోయినా, హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్నా దాని రక్తహీతన(ఎనీమియా) అంటారు.

కారణాలు

- ఆహారంలో ఇనుముకు సంబంధించిన పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, ప్రొటీన్లు తగినంత లేకపోవడం
- రక్తం ఉత్పత్తయ్యే దానికన్నా గర్భస్రావాలు, కాన్పులు, నెలసరి రుతుస్రావం, మొలలు మొదలైన వాటి వల్ల ఎక్కువగా శరీరం నుండి రక్తం పోవడం
- రక్తం తక్కువ తయారు కావడం లేదా శరీరం నుంచి ఎక్కువ బయటకు పోవడం
- ఎదల్లో సాధారణంగా ఉండే పోషకాహార లోపం
- కొందరికి కొన్ని పదార్థాలు, మందుల వల్ల వస్తుంది.
- వివిధ ప్రొటీన్లు, విటమిన్ సీ, జింకు, రాగి వంటి ఖనిజాలు, మరికొన్ని ఇతర విటమిన్ల లోపం
- ఇనుము సరఫరా తగ్గిపోవడం
- సీ విటమిన్ లోపంతో పళ్ల నుంచి రక్తం కారి స్కర్వీ వ్యాధి వల్ల వస్తుంది.
- పేగుపూత, గ్యాస్ట్రబుల్ ఉన్నవారు ఏది తిన్నా కడుపులో మంట వస్తుంది. దీని వల్ల వారు ఏమీ తినకపోయినా, పోహకాహారం తీసుకోకపోయినా అది శరీరానికి వంటబట్టక రక్తహీనత వస్తుంది.
- తరచూ నీళ్ల విరేచనాలతో బాధపడేవారికి తిన్నది వంటబట్టకపోయినా వస్తుంది.
- శరీరంలో ఫోలిస్‌యాసిడ్, బీ 12, థైరాక్సిన్ లోపం
- కడుపులో పురుగులు రక్తం పీల్చుకోవటం వల్ల, రక్తం గడ్డకట్టే లక్షణం కోల్పోయిన హిమోఫీలియా వంటి అరుదైన జబ్బు ఉన్నవారికి వస్తుంది.

ప్రాణానికి ప్రమాదం



రక్తహీనత స్త్రీలలో, పిల్లల్లో మరీ తీవ్రంగా ఉంటుంది. 5 నుంచి 8 గ్రాముల మధ్య ఉంటే రోగనిరోధకశక్తి తగ్గిపోయి త్వరగా జబ్బులకు గురవుతారు. రక్తహీనత వల్ల వారికి పుట్టే పిల్లలు బరువు తక్కువగా పుడతారు. ఒక్కోసారి పుట్టిన వెంటనే చనిపోతారు. కొన్నిసార్లు తల్లికూడా చనిపోయే ప్రమాదం ఉంది. రక్తహీనత ఉన్నవారు సరిగ్గా ఊపిరి పీల్చుకోలేకపోతారు. పిల్లలు ఎక్కువసేపు ఆటలు ఆడలేరు. చదువులో వెనుకబడిపోతారు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి,
స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్యనిపుణురాలు, గుంటూరు

ఉచితంగా వైద్యసేవలు



ఎనీమియా ముక్తభారత్‌లో రక్తహీనత నివారణ కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరఫ్‌బాటిల్స్ అందిస్తున్నాం. కౌమార దశలో ఉండే బాలికలు, గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి వారిలో రక్తహీనత నివారణ చర్యలు తీసుకుంటున్నాం. మాత్రలు అందించటంతో పాటు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇచ్చి అవసరమైతే రక్తం కూడా ఉచితంగా ఎక్కించి గర్భిణుల్లో రక్తహీనత నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

కేంద్రీయ విద్యాలయంలో బీఓబీ సన్ రూఫ్ నిర్మాణం



కొరిటెపాడు(గుంటూరు): నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.2 లక్షల విలువైన సన్ రూఫ్‌ను నిర్మించినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) రీజినల్ మేనేజర్ పి.అమరనాథరెడ్డి తెలిపారు. నూతనంగా నిర్మించిన సన్ రూఫ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో బీఓబీ ముందువరుసలో ఉంటుందని వెల్లడించారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ హనీ మెహతా మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పిల్లలు ఇబ్బందులు పడకుండా బీఓబీ యాజమాన్యం సన్ రూఫ్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బీఓబీ రీజినల్ మేనేజర్ అమరనాథరెడ్డి, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బీఓబీ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ డెప్యూటీ రీజినల్ మేనేజర్ ఎం.విద్యాసాగర్, చీఫ్ మేనేజర్లు ఎం.పి.సుధాకరరావు, వై.సుబ్రహ్మణ్యం, రాజభాష అధికారి డి.రమేష్‌బాబు, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, కేంద్రీయ విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఆనంద్ పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బండికల్లు జమదగ్ని శుక్రవారం తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తుములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగే సభలో 'కాలం సాక్షి'గా పుస్తకంపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నరేంద్ర జీవితం సర్వం.. అవినీతి పర్వం

- ఎమ్మెల్యే కిలారి రోశయ్య ధ్వజం
- గ్రావెల్ మాఫియాపై చర్చకు సిద్ధం
- ధూళిపాళ్ల నరేంద్రకు సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య

పట్నంబజారు: నీ జీవితం సర్వం అవినీతి పర్వం.. మైనింగ్ మాఫియా డాన్‌గా పేరున్న నువ్వు.. గ్రావెల్ మాఫియా గురించి మాట్లాడటమా? పొన్నూరు నియోజకవర్గంలో ఏ తలుపు తట్టినా.. నీ అక్రమాల్ని కథలుగా చెబుతారని పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ధ్వజమెత్తారు. 500 ఎకరాల్లో గ్రావెల్ మాఫియా చేశారని వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర నిరూపించాలని సవాల్ విసిరారు. నరేంద్ర ఆయన తమ్ముడు సురేంద్ర మైనింగ్ మాఫియాకు నిలువుటద్దాలని విమర్శించారు. ఎవరి ఆస్తులు ఎంత ఉన్నాయో బహిరంగంగా మాట్లాడే దమ్ముందేమో చెప్పాలని డిమాండ్ చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్లలో 500 ఎకరాల్లో గ్రావెల్ మాఫియా జరిగితే, 25 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న నరేంద్ర ఎంత చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మైనింగ్ మాఫియా డాన్‌గా పేరున్న నరేంద్ర గ్రావెల్ మాఫియా గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేవారు. వి.ఎన్.పాలెం, వడ్లమూడి, శేకూరుతో పాటు తదితర ప్రాంతాల్లో ఎక్కడైనా.. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరిగిందని చూపించగలరా ? అని ప్రశ్నించారు. పూర్తిస్థాయి అనుమతులతో పలు ప్రాంతాల్లోని జగనన్న కాలనీలు, రైల్వేకు సంబంధించి జీఆర్ ఇన్‌ఫ్రా అనే కంపెనీలకు పూర్తిస్థాయిలో లెక్కల ప్రకారం, ఇప్పటి వరకు 9.76 లక్షల టన్నుల గ్రావెల్ వెళ్లిందని చెప్పారు. నరేంద్రలాగా క్వారీ ఆలయం వద్ద 38 ఎకరాల్లో అక్రమంగా తవ్వలేదని, కేవలం దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని తెలిపారు. పూర్తిస్థాయి అధికారుల అనుమతులతో ఇప్పటి వరకు 32 ఎకరాల్లో మాత్రమే గ్రావెల్ తవ్వకాలు జరిగాయని వివరించారు. వ్యాపారాలు చేసి తాను పైకి వచ్చానని.. నరేంద్ర మాదిరిగా పాడి రైతుల్ని మోసం చేసి రాలేదని మండిపడ్డారు. పెద్దఎత్తున మైనింగ్ మాఫియాకు పాల్పడ్డ నరేంద్ర, దళితులకు ఇచ్చిన భూముల్ని సైతం లాక్కుని మైనింగ్ చేశారని ఆరోపించారు. రైల్వే భూముల్లో సైతం మైనింగ్ చేస్తే.. నీపై కేసు పెట్టలేదా? అని రోశయ్య ప్రశ్నించారు. సంగం డైయిరీని అడ్డం పెట్టుకుని చేస్తున్న అవినీతి, బోనస్‌లు ఎగ్గొట్టిన సంగతీ ప్రతి ఒక్కరికి తెలుసన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. న్యాయస్థానాల ద్వారా నరేంద్ర అవినీతిపై పోరాడతామని స్పష్టం చేశారు. ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రావెల్‌కు సంబంధించిన పూర్తిస్థాయి రికార్డులు, అందిన చెక్కుల వివరాలు, వినియోగదారుల వివరాలు, గ్రావెల్ తవ్వకాల అనుమతులను మీడియాకు చూపించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో టీజేపీఎస్ కళాశాల విద్యార్థుల విజయభేరి



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన టీజేపీఎస్ కళాశాల విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ అభినందించారు. పట్టాభిపురంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఈసీ, ఎంఈసీ, ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలలో ఎక్కువ మంది అధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. సీనియర్ ఇంటర్ సీఈసీలో ఎల్. లక్ష్మీ బాలకృష్ణ వెయ్యికి 930, జి. దేవ్ శ్రీ మేఘనాథ్ 912, ఎంపీసీలో కె.కార్తీక్ 927, ఎస్.ఆనంద్ ప్రభుదాస్ 917, గౌస్‌ఖాన్ 900 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ సీఈసీలో ఏ. వేణుగోపాలస్వామి 472, ఏ. ఆనంద్ శేఖర్ 402, ఎంపీసీలో ఎం.వి.మహేష్‌బాబు 432, వీకే తేజస్వి 415 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల కరస్పాండెంట్ తెల్లాకుల శ్రీనివాసబాబు, క్యాంపస్ ఇంచార్జ్ జి. సురేష్ కుమార్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో పాత గుంటూరు నంది వెలుగురోడ్డులోని ఏపీ మైనార్టీ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సీహెచ్. శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 86 శాతం, జూనియర్ ఇంటర్లో 63 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల వారీగా విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు.

నేడు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి శనివారం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు సీడీపీవో వి. సుజాతాదేవి తెలిపారు. యనమదల శివాలయం సెంటరు, లేమల్లెపాడు, జీజీపాలెం, ఏబీపాలెం, ముట్లూరు బీసీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శనివారం గుంటూరు మహిళా ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

'జగనన్నే మా భవిష్యత్తు' ర్యాలీకి విశేష స్పందన



ర్యాలీలో మేయర్ కావటి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, డెప్యూటీ మేయర్లు

పట్నంబజారు: మా నమ్మకం నువ్వే జగన్–జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు వెల్లడించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముగిసిన నేపథ్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా నేతృత్వంలో.. వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని కార్యాలయం వద్ద ప్రారంభమైంది. పాత బస్టాండ్ వరకు వెళ్లి, తిరిగి కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. తిరిగి ఆయన్ని సీఎంని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ మోసం చేయడం చంద్రబాబు నైజం అయితే.. చెప్పిన మాటకు కట్టుబడి చిత్తశుద్ధితో హామీలు అమలు చేయడం సీఎం జగన్ నైజమని తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిశీలకులు అడపా శేషు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ ద్వారా వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందని చెప్పారు. నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌పై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కచ్చితంగా సీఎంగా జగన్ తిరిగి ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు షేక్ సజీల, వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నేతలు మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి, కోలా భవాని, గనిక ఝాన్సి, మనోరంజని, మెహమూద్, యిర్రి ధనలక్ష్మి, సంకూరి శ్రీను, ఆబీబాషా, షేక్ మీరావలి, అజయ్, వంశీ, వేముల జ్యోతిపద్మజ, పోలవరపు జ్యోతి, పాపతోటి అంబేడ్కర్, రవి, మెహబూబ్ పాల్గొన్నారు.

టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో విస్తృత ఉపాధి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య పూర్ణచంద్రరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచీకరణ నేపథ్యంలో టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఏఎన్‌యూ టూరిజం–ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సుల విభాగాధిపతి ఆచార్య పి.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం చరిత్ర, టూరిజం–ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో టూరిజం, ట్రావెలిజం మూడో స్థానంలో నిలిచి ఆయా దేశాల ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. తరచూ విహార యాత్రలు చేయడం ద్వారా విజ్ఞానం, వినోదంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని చెప్పారు. టూరిజం ద్వారా ప్రజలకు ఆయా ప్రాంతాల చరిత్ర, భాషలు, సంస్కృతులు, నాగరికత, ఆచార వ్యవహారాల గురించి పూర్తిగా తెలుసుకునే అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి చెందిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా రోడ్డు, రైలు, విమాన, సముద్ర ప్రయాణాల ద్వారా లక్షలాది పర్యాటకుల సంఖ్య పెరిగిందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాల ద్వారా సాధారణ కోర్సులతో పాటు వృత్తి విద్యా కోర్సులతో ప్రతి సంవత్సరం వందలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చరిత్ర, టూరిజం–ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.అనురాధ, అధ్యాపకులు ఎం.భాస్కరరావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యోత్సవాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న రవి



మహిమ



సోమనాథ్ భరద్వాజ్

పాత గుంటూరు: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై సాయిమంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో మహామంజీర నాదం పేరుతో నృత్యోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం కార్యక్రమాన్ని నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కథా రచయిత అక్కిరాజు శ్రీహరిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్య కళాకారిణి, అభినవ సత్యభామ కళాకృష్ణకు అక్కిరాజు మణిప్రియ స్మారక సాత్రాజితి పురస్కారాన్ని సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం అందజేశారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన జి.రవి, అనంతపురానికి చెందిన కె.సోమనాథ్ భరద్వాజ్, గుంటూరుకు చెందిన పూల మహిమ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారికి యువకళారత్న పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమాన్ని నాట్యాచార్య పట్నం శివప్రసాద్ పర్యవేక్షించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ వృత్తి విద్య కళాశాల విద్యార్థినుల సత్తా



అంజుమ్



భువనేశ్వరి



మాధురి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో సాంబశివపేటలోని ప్రభుత్వ వృత్తి విద్యా బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఎస్. ఆనందబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 59 శాతం, ద్వితీయ సంవత్సరంలో 79 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్‌లో నర్సింగ్ విద్యార్థిని షేక్ శైలు 500 మార్కులకు 489, సీనియర్ ఇంటర్‌లో నర్సింగ్ విద్యార్థిని షేక్ ఫర్హత్ అంజుమ్ వెయ్యి మార్కులకు 986 మార్కులో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. అదే గ్రూప్‌కు చెందిన త్రిపుర రమ్య భువనేశ్వరి 976, పీఎస్‌టీటీ విద్యార్థిని బుట్టి మాధురి 975 మార్కులతో జిల్లాలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్‌లో 400కు పైగా మార్కులతో 88 మంది, సీనియర్ ఇంటర్‌లో 900 మార్కులకు పైగా 19 మంది సాధించారని తెలిపారు.

భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో రోడ్ల మీద భవన నిర్మాణ వ్యర్థాల్ని మూడు రోజుల్లో తొలగించాలని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా వేసిన వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పట్టణ ప్రణాళిక అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. భవన నిర్మాణ సమయంలో తప్పనిసరిగా గ్రీన్‌మ్యాట్‌తో దుమ్ము రాకుండా కవర్ చేసుకోవాలని యజమానులకు సూచించాలని చెప్పారు. ఇప్పటివరకు రీ సర్వే 76 శాతం జరిగిందని, వచ్చే వారానికి 85 శాతం జరగాలని ఆదేశించారు. మే నెలాఖరు నాటికి మీడియా డివైజ్ ఫీజులు నూరు శాతం వసూలు చేయాలని తెలిపారు. బకాయిలు చెల్లించని ప్రకటనల బోర్డుల తొలగింపు వెంటనే చేపట్టాలని చెప్పారు. సమావేశంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీలు బాబూరావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, సర్వేయర్లు సునీల్ కుమార్, హరికృష్ణ, టీపీఎస్‌లు పాల్గొన్నారు.